సమావేశము - III
వాల్యూం - I
నెం. 1

వెల : రూ. 20-00
23 జూలై, 2024
మంగళవారము

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

1. సంతాప ప్రతిపాదన ... 01

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
		శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి
ఉప కార్యదర్శులు	:	శ్రీ డి. శ్రీనివాసులు
		శ్రీమతి ఎస్. నాగమణి
సహాయ కార్యదర్శులు	:	శ్రీమతి బి. ప్రమీల
		శ్రీ ఎమ్. రఘుమారెడ్డి
		శ్రీ ఎ. సుధాకర్
		శ్రీ పి. శ్రీనివాస్
		శ్రీమతి ఎ. పద్మాసిని
		శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ
		శ్రీ ఎస్. సుజిత్ కుమార్
		శ్రీ కె. భాస్కర శ్రీనివాస్
		శ్రీ సి.కె. వినోద్ కుమార్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వర రెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(మూడవ సమావేశము – మొదటి రోజు)

మంగళవారము, జూలై 23, 2024

(జాతీయ గీతాలాపనతో సభ ఉ. గం. 11.00 లకు ప్రారంభమైనది)

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులందరికీ హృదయ పూర్వక నమస్కారాలు. సంతాప ప్రతిపాదన..

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, తమరి అనుమతితో ఈ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాను.

"తెలంగాణ శాసన సభ సభ్యురాలు కుమారి లాస్యనందిత సాయన్న గారి మృతిపట్ల ఈ సభ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది."

అధ్యక్షా, 23.02.2024 నాడు జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ్యురాలు కుమారి లాస్యనందిత సాయన్న గారి ఆకస్మిక మరణం పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. ఇలాంటి బాధాకరమైన తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి వచ్చినందుకు నేను చింతిస్తున్నాను. కుమారి లాస్య నందిత సాయన్న గారి నాన్న గారైన కీ.శే.సాయన్న గారు నాకు అత్యంత సన్నిహితులు, ఆప్తులు. చాలా సంవత్సరాలు మేము కలిసి ప్రజాప్రతినిధులుగా ప్రజా క్షేత్రంలో పనిచేయడం జరిగింది. సాయన్న గారు అత్యంత సామాన్యమైన కుటుంబంలో 1951లో వల్లభా నగర్, నిజామాబాద్ జిల్లాలో జన్మించి, కష్టపడి వారు ఐదు పర్యాయాలు శాసనసభ్యుడిగా, ప్రజా జీవితంలో కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా కంటోన్మెంట్ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారంలో వారు ఎనలేని కృషి చేశారు. వారు సిట్టింగ్ శాసనసభ్యుడిగా ఉన్నప్పుడే ప్రజా జీవితంలోనే మరణించడం జరిగింది.

ఆ తరువాత వారిచ్చిన వారసత్వాన్ని, వారు నెరవేర్చాల్సిన బాధ్యతలను, వారిని అభిమానించిన ప్రజల కోసం కుమారి లాస్యనందిత కూడా ప్రజా జీవితంలోకి వచ్చి సాయన్నగారు బ్రతికి ఉన్నప్పుడే కార్పొరేటర్‌గా, ఆ తరువాత వారి తరఫున వారిని నమ్ముకున్న ప్రజల కోసం వారు శాసనసభ్యురాలిగా ఎన్నికై కష్టపడి పనిచేయాలన్న ఆలోచనతోటి ప్రజా జీవితంలోకి వచ్చారు. ఐదుసార్లు శాసన సభ్యుడిగా సాయన్న గారు చేసిన ఎనలేని సేవలను దృష్టిలో పెట్టుకొని వారి వారసురాలిగా కుమారి లాస్యనందితను కంటోన్మెంట్ ప్రజలు ఎన్నుకోవడం జరిగింది.

మంచి చదువులు చదువుకున్న 37 సంవత్సరాల యువతి, వెనకబడిన సామాజికవర్గాల నుండి చైతన్యంతో ప్రజలకు సేవనందించాలని ముందుకు రావడం జరిగింది. మనందరం కూడా మహిళా సాధికారితకోసం ఎదురుచూస్తున్న వాళ్లం. ఆ మహిళల తరఫున ప్రజాప్రతినిధిగా ఇక్కడకు వచ్చి సమస్యల పట్ల చిత్తశుద్ధితో వారు ఈ సభలో పోరాడుతారని మనందరం భావించాం. కానీ, ఔటర్ రింగ్‌రోడ్డు మీద వారు ప్రయాణం చేస్తున్న కారు దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై మరణించడం జరిగింది. ప్రమాదం జరిగిన చోట నుండి వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లగా, తలకు తీవ్రమైన గాయం అవడం వల్ల వారు అప్పటికే మరణించడం జరిగిందని డాక్టర్లు చెప్పడం జరిగింది.

వాస్తవంగా ఆ కుటుంబానికి ప్రజలతో ఉన్న సత్సంబంధాలు, అలాగే ప్రజా సమస్యల మీద పోరాడిన విషయం గురించి కంటోన్మెంట్ ప్రాంతంలోనే కాకుండా జిహెచ్ఎంసి పరిధిలో ఎవరిని అడిగినా కూడా చెబుతారు. ముఖ్యంగా కీ.శే. సాయన్న గారు మృదు స్వభావి. వారు అందరితో మంచి సంబంధాలను కలిగి ఉండి, రాజకీయాలకు అతీతంగా ఆ ప్రాంత సమస్యల కోసం పోరాడారు. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసిలో కలిపే విషయంలో గానీ, కంటోన్మెంట్ ప్రాంతాల్లోని ఆర్మీ అధికారులు వల్ల కలుగుతున్న రోడ్ల సమస్యల విషయంలో గానీ, ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో గానీ, ఇంకా చాలా విషయాల్లో అలుపెరగకుండా పోరాడేవారు. నేను పార్లమెంట్ సభ్యుడిగా డిఫెన్స్ కమిటీలో సభ్యుడిగా ఉన్నప్పుడు సాయన్న గారు ఎన్నోసార్లు కంటోన్మెంట్ బోర్డు సమావేశాల్లో అక్కడి సమస్యల్ని ప్రస్తావించేవారు. ఎందుకంటే వారు ఎమ్మెల్యేగా, నేను ఎంపిగా ఈ సమస్యల్ని పరిష్కరిస్తే కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు న్యాయం జరుగుతుంది, మేలు జరుగుతుందని చెప్పి వారు పరితపించేవారు. కానీ, దురదృష్టవశాత్తు ఎలివేటెడ్ కారిడార్ల అనుమతి, అదే విధంగా కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసిలో కలపడానికి అనుమతి వచ్చే సమయానికి వారు లేరు. వారి వారసురాలిగా వచ్చిన లాస్యనందిత గారైనా ఈ సందర్భంలో ఉండి ఉంటే, సాయన్న గారు ప్రజలకు ఇచ్చిన మాట నెరవేరిందని చాలా సంతోషపడే వారు. కానీ, దురదృష్టవశాత్తు లాస్యనందిత గారు అత్యంత కీలకమైన ఈ కంటోన్మెంట్ సమస్యల పరిష్కార సమయంలో మన మధ్య లేకపోవడం బాధాకరమైన విషయం.

11.10 ఉ. ఏది ఏమైనా కంటోన్మెంట్ ప్రజల హృదయాలలో సాయన్న గారు గానీ, సాయన్న గారి కుమార్తె మరియు వారసురాలైన లాస్యనందిత గారు గానీ శాశ్వతంగా ప్రజల హృదయాలలో నిలిచిపోతారు. వారి ప్రాంతంలో ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనలో మిగిలిపోయిన పనులన్నింటినీ ఈ ప్రభుత్వం తప్పకుండా పూర్తి చేస్తుంది. వారిని చిరస్థాయిగా గుర్తు పెట్టుకునే విధంగా ఆ పనులను ఈ ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తుంది. లాస్యనందిత గారి మృతి పట్ల నేను ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నాను. శోకార్తులైన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతోంది.

శ్రీ కె. తారక రామారావు:- అధ్యక్షా, ముందుగా తమరికి ధన్యవాదాలు. ఎందుకంటే, ఒక యువ శాసనసభ్యురాలు అనుకోని పరిస్థితుల్లో ఇవాళ మన మధ్యన లేని సందర్భంలో, ఈ రోజు మొత్తం కేవలం సంతాప తీర్మానంపైనే మాట్లాడడానికి సభ్యులందరికీ అవకాశమిచ్చినందుకు ముందుగా తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, నిజంగా కూడా కొన్ని సందర్భాలు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. ఇప్పుడే ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు.సాయన్న గారు ఒక సీనియర్ శాసనసభ్యుడు. శాసనసభ్యుడిగా ఐదు సార్లు గెలిచిన ఒక మంచి వ్యక్తి. మృదు స్వభావి. ఎప్పుడు, ఎక్కడ, ఎవరిని కలిసినా, ఏ పార్టీలో ఉన్నా, ఒక అజాతశత్రువుగా మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి సాయన్న గారు. గతంలో పెద్దలు సాయన్న గారూ, మేమూ అందరమూ కూడా కలిసికట్టుగా కేసీఆర్ గారి నాయకత్వంలో నగరాభివృద్ధి కొరకు పనిచేశాం. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధితోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి కొరకు కూడా చాలా కమిట్‌మెంట్‌తో పని చేసినటువంటి మంచి నాయకుడు సాయన్న గారు.

అధ్యక్షా, సాయన్న గారు మరియు మా ముషీరాబాద్ గౌరవ శాసనసభ్యులు శ్రీ ముఠా గోపాల్ గార్లిద్దరూ కూడా చిరకాల మిత్రులు. వారిద్దరూ కూడా దశాబ్దాల కాలంపాటు స్నేహితులు. అధ్యక్షా, వారు మీకు కూడా మంచి స్నేహితులు. నాకు బాగా గుర్తున్న సందర్భం.. 2015వ సంవత్సరంలో జిహెచ్ఎంసి ఎన్నికలు వచ్చినప్పుడు సాయన్న గారు ఒకే ఒక కోరిక కోరారు. కవాడిగూడ నుండి లాస్యనందిత గారిని కార్పొరేటర్‌గా నేను చూడాలనుకుంటున్నాను, నా మిత్రుడు గోపాల్‌గారు కూడా అందుకు మద్దతుగా ఉన్నారని తెలుపుతూ లాస్యనందిత గారికి

అవకాశమివ్వాల్సిందిగా సాయన్న గారు మొదటిసారి కేసీఆర్ గారిని కోరారు. కేసీఆర్ గారు కూడా కాదనకుండా, ఆ అమ్మాయి బాగా చదువుకున్న అమ్మాయి, యంగ్ లీడర్ కాబట్టి, మంచి భవిష్యత్తున్న నాయకురాలుగా ఎదుగుతుందనే ఉద్దేశ్యంతో ఆనాడు లాస్యనందిత గారికి కవాడిగూడ నుంచి కార్పొరేటర్‌గా మంచి అవకాశమిచ్చి, వారిని గెలిపించుకోవడం జరిగింది.

కానీ, కొన్ని సందర్భాలు ఎలా ఉంటాయంటే అధ్యక్షా, సాయన్న గారి కుటుంబాన్ని చూస్తుంటే విధి నిజంగానే వారి మీద పగబట్టిందేమో అన్నంత తీవ్రంగా ఒకే సంవత్సరంలో, అటు సాయన్న గారు మరణించడం, ఆ తరువాత, అనుకోని విధంగా మమ్మల్నందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తూ లాస్యనందిత గారు కూడా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడం అత్యంత ఆవేదన కలిగించే అంశాలు. ఒకే ఏడాదిలో అటు తండ్రి, ఇటు కూతురు చనిపోవడ మంటే, ఆ కుటుంబంలో ఎంతటి విషాదముంటుందో మనం ఊహించవచ్చు. ఆమె చాలా చురుకైన అమ్మాయి. ఆనాడు కార్పొరేటర్‌గా జిహెచ్ఎంసీలో చురుకుగా పనిచేశారు.

కొంత కాలానికి సాయన్న గారి ఆరోగ్యం బాగాలేకుండ అయ్యింది. డయాబెటిస్ ఎక్కువై చివరికి leg amputate చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పుడు కూడా, ఒక వైపు నందిత, మరొక వైపు నివేదిత ఎల్లవేళలా సాయన్న గారికి తోడుగా ఉండేవారు. సాయన్న గారు ఏ సమావేశానికి వచ్చినా, ఏ కార్యాలయానికి వెళ్ళినా లేదా ఎవరైనా మంత్రులను కలిసేందుకు వెళ్ళినా, అధికారులను కలిసేందుకు వెళ్ళినా కూడా సాయన్న గారి ఇద్దరమ్మాయిలు కూడా ఆయనకు కుడి భుజం, ఎడమ భుజం మాదిరిగా రెండు వైపులా ఉండి వారిని తీసుకువెళ్ళేవారు. మా దగ్గరికి కూడా చాలాసార్లు ముగ్గురూ కలిసి వచ్చేవారు. సాయన్న గారు మరణించిన తరువాత, ఇదే శాసనసభలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు సాయన్న గారి సంతాప తీర్మాన సందర్భంలో మాట్లాడుతూ, ఆ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారిచ్చిన హామీ ప్రకారమే కుమారి లాస్యనందిత గారికి 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మా పార్టీ నుంచి అవకాశమివ్వడం జరిగింది. ఇప్పుడే ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా, రాజకీయాలకు అతీతంగా అందరితో కలిసిమెలిసి మెలిగేటువంటి మంచి వ్యక్తిత్వం వారిది. కంటోన్మెంట్ ప్రజలకు సాయన్న గారు చేసినటువంటి సేవ, పార్టీ అండతో మరియు వారి తండ్రిగారి ఆశీస్సులతో లాస్యనందిత గారు కూడా కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిగారు.

అధ్యక్షా, బాధాకరమేమంటే, లాస్యనందిత గారు ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది కాలానికే మృతి చెందడం మమ్మల్ని ఎంతగానో కలచివేసింది. ఎన్నికలైన తరువాత నల్గొండలో మా పార్టీ సభ జరుగుతుంటే, దానికి లాస్యనందిత గారు కూడా రావడం జరిగింది. ఆరోజు వారు ఒక రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారి కారు పూర్తిస్థాయిలో ధ్వంసమైంది. వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చాలా ఇబ్బంది పడ్డారు. ఎంతో మనోవేదనకు కూడా గురయ్యారు. ఆ తరువాత వారి ఇంట్లో కూడా ఒక చిన్న ప్రమాదం జరిగింది. వరుసగా, అదేదో పగబట్టినట్టే, నల్గొండలో ప్రమాదం, తరువాత వారింట్లో లిఫ్ట్ ప్రమాదం, ఆ తరువాత అనుకోకుండా మళ్ళీ రోడ్డు ప్రమాదం.. ఓఆర్ఆర్ మీద జరిగినటువంటి రోడ్డు ప్రమాదంలో వారు మరణించడం జరిగింది. మేము సాయన్న గారు చనిపోయిన తరువాత వారి కుటుంబానికి... వారి కుటుంబం మా కుటుంబమే అని ఒక పార్టీగా మాట ఇచ్చాం. సాయన్న గారి మరణం తరువాత లాస్యనందిత గారికి పార్టీ ఎమ్మెల్యేగా అవకాశమిస్తే, వారు కూడా కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ, దురదృష్టవశాత్తు ఏడాది కూడా కాకముందే, వారు మరణిస్తే, మొన్న జరిగిన ఉప ఎన్నికలలో కేసీఆర్‌గారి నాయకత్వంలోని మా పార్టీ తిరిగి లాస్యనందిత గారి సోదరి అయిన నివేదిత గారికి కూడా ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశాన్నిచ్చింది. కానీ, దురదృష్టం, ఆ ఉప ఎన్నికల్లో మా పార్టీ ఓటమి పాలుకావడం జరిగింది.

అధ్యక్షా, లాస్యనందిత గారు ఒక చురుకైన నాయకురాలు. ఒక మంచి వ్యక్తిత్వం, ఉన్నత విద్యార్హతలు కలిగినటువంటి ఒక మహిళ ఈ శాసన సభలో అడుగుపెట్టిందని మేము చాలా సంతోషపడ్డాం. ఆ అమ్మాయి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆశించాం. కానీ, ఆమె అడుగుపెట్టిన కొద్ది కాలానికే ఇదే సభలో ఆమె సంతాప తీర్మానం మీద మాట్లాడవలసి వస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. మా సభ్యులందరు ఎంతో మనోవేదనకు లోనవుతున్నారు. ముఖ్యంగా మా గోపాల్ అన్న గారు ఎంత బాధపడ్డారో నేను కళ్ళారా చూశాను. సాయన్న గారి మరణం తరువాత ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో మేమందరం ఆ కుటుంబానికి అండగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబానికి భవిష్యత్తులో కూడా సంపూర్ణంగా అండగా ఉంటాం. ఈ సంతాప తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, లాస్యనందిత గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, కంటోన్మెంట్ శాసనసభ్యురాలు కుమారి లాస్యనందిత సాయన్న గారి ఆకస్మిక మరణంపై గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. యువ ఎమ్మెల్యే లాస్య నందిత గారి మరణం, కంటోన్మెంట్ ప్రజానీకంతోపాటు యువ నాయకత్వానికి కూడా తీరని లోటుగా నేను భావిస్తున్నాను. సాయన్న గారి ముగ్గురు కూతుర్లలో చిన్నవారైన లాస్యనందిత గారు, మొదట 2015వ సంవత్సరంలో పికెట్ నుంచి వార్డు మెంబరుగా పోటీ చేశారు. 2016లో కావడిగూడ కార్పొరేటర్‌గా పోటీ చేసి, వారి ప్రజా జీవనాన్ని మొదలుపెట్టారు. తదనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న సాయన్న గారికి, వారి కుటుంబ సభ్యుల ద్వారా కంటోన్మెంట్ ప్రజలకు సేవలందిచాలని భావించి, చాలా చురుకుగా ఆ ప్రాంత ప్రజలకు సేవలందించిన వ్యక్తిగా ఆమె పేరు గడించారు.

అధ్యక్షా, రెండు సంవత్సరాల క్రితమే సాయన్న గారి కోరిక మేరకు, సాయన్న గారి వారసులుగా కుమారి లాస్యనందిత గారికి వారి పార్టీ అవకాశమివ్వడంతో, లాస్యనందిత గారు కవాడిగూడ కార్పొరేటర్‌గా ఎన్నికై, చురుకుగా పనులు చేస్తూ, మెరుగైన రీతిలో శాయశక్తులా కృషి చేయడం ద్వారా స్థానికంగా మంచి గుర్తింపుని పొందారు. అనంతరం అనారోగ్యంతో సాయన్న గారు మరణించగా, వారి కుటుంబ సభ్యుల ఆలోచన మేరకు సాయన్న గారి వారసురాలిగా లాస్యనందిత గారు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా పోటీ చేసి, చిరు ప్రాయంలోనే పెద్ద మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. శ్రీ సాయన్న గారి వారసత్వాన్ని కొనసాగిస్తూ కుమారి లాస్యనందిత గారు కంటోన్మెంట్ ప్రజల మన్ననలను పొందుతున్న తరుణంలో దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఆమె ఆకస్మికంగా మరణించడం, మనందరి నుండి దూరం కావడం ఎంతో విచారకరం. వారి దుర్మరణం వారి కుటుంబానికే కాకుండా కంటోన్మెంట్ ప్రజలందరికి కూడా తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకి మరియు కంటోన్మెంట్ ప్రజలకి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, ధన్యవాదాలు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత గారి మృతిపట్ల భారతీయ జనతాపార్టీ తరఫున సంతాపం తెలియ జేస్తున్నాము. వారి అకాల మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. లాస్య తండ్రి గారైన సాయన్న గారు ఐదు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. వారి వారసురాలిగా వచ్చిన లాస్యనందిత గారు చాలా పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతకు మునుపు కార్పొరేటర్‌గా పని చేసినటువంటి అనుభవం వారికుంది. వారు విద్యావంతురాలు. బి.టెక్. చదివినటువంటి లాస్యనందిత గారికి చాలా మంచి భవిష్యత్తు ఉంటుందని మేము భావించాం. అందరితో కలుపుగోలుగా ఉండేటువంటి లాస్యనందిత గారు ఈ రోజు మన ముందు లేకపోవడం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. అతి పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలిచిన లాస్యనందిత గారికి గొప్ప భవిష్యత్తు ఉంటుందని భావించాం. కానీ, మరోలా భగవంతుడు ఆమెను తన దగ్గరికి చేర్చుకోవడం, మన మధ్య నుండి వారిని తీసుకెళ్ళడం చాలా బాధాకరమైన విషయం. వారి మరణం పట్ల భారతీయ జనతా పార్టీ దిగ్భ్రాంతిని

తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నది.

11.20 ఉ. **శ్రీ పొన్నం ప్రభాకర్**:- అధ్యక్షా, లాస్య నందిత గారు కంటోన్మెంట్ శాసన సభ్యురాలిగా ఎన్నికై, మొదటిసారిగా శాసనసభ సమావేశాలలో పాల్గొని, 23.02.2024 నాడు జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఆరోజు వారి మరణ వార్త విన్న వెంటనే, ముఖ్యమంత్రిగారి ఆదేశం మేరకు హైదరాబాదు ఇన్‌ఛార్జి మంత్రిగా నేను అక్కడికి వెళ్ళి ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. సాయన్నగారి తరువాత లాస్య నందితగారు... ఒకే సంవత్సరంలో ఇద్దరూ మరణించారు. ఒక యువ శాసన సభ్యురాలిగా హైదరాబాదు నగరాభివృద్ధిలో 15 మంది శాసన సభ్యుల్లో తను కూడా ఒక పాత్ర వహించి హైదరాబాదుకు సంబంధించిన అభివృద్ధిలో భాగస్వామిగా, యువ శాసన సభ్యురాలిగా ఉంటుందని ఆశించాం. కానీ, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా, విధి వెంటాడినట్లుగా రెండు, మూడు ప్రమాదాల నుండి బయటపడి, చివరికి రోడ్డు ప్రమాదంలో వారు ఆకస్మికంగా మృతి చెందిన పరిస్థితిని చూశాం. వారి మరణం మనందరికీ తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు, వారి కుటుంబంలో జరిగిన పరిణామాల పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

جناب احمد بن عبداللہ بلعلہ (JANAB AHMED BIN ABDULLAH BALALA): اسپیکر صاحب! میں میری پارٹی کی جانب سے لاسیا نندتا سایّنا جو اس بار ہمارے ساتھ ایم ایل اے تھیں، ان کے پرسے کیلئے کھڑا ہوا ہوں۔ سایّنا صاحب نے جملہ پانچ بار اس اسمبلی میں اپنے حلقہ کے لوگوں کی نمائندگی کی۔ وہ پہلی بار تلگو دیشم پارٹی سے کامیاب ہوئے تھے۔ تلنگانہ الگ ہونے کے بعد انہوں نے دوبار بی آر ایس پارٹی سے الیکشن لڑا۔ ان کے انتقال کے بعد بی آر ایس پارٹی نے ان کی بیٹی کو ٹکٹ دیا اور سکندرآباد کنٹونمنٹ کی عوام نے اپنی نمائندگی کے لئے ان کو منتخب کیا تھا۔ بڑے افسوس کی بات ہے کہ وہ بہت ہی کم عمر میں ایک حادثہ میں اس دنیا کو چھوڑ کر چلی گئیں۔ میں اپنی پارٹی کی جانب سے اور ہم سب کی جانب سے ان کے تمام افراد خاندان کے لئے دعا کرتا ہوں کہ اللہ ان کو صبر دے۔ شکریہ۔

శ్రీ కూనంనేని సాంబశివరావు:- అధ్యక్షా, ఈరోజు కుమారి లాస్య నందిత గారి సంతాప సభ జరుపుకోవటం చాలా విచారకరం. లాస్య నందితగారి తండ్రి సాయన్నగారు మృదు స్వభావి. వారు వారి ప్రాంతానికే కాకుండా, ఎక్కువ మందికి తెలిసిన వ్యక్తి. మంచి పేరు కలిగిన వ్యక్తి. ఆయన మరణించిన తరువాత వారి కుమార్తెకు పోటీ చేసే అవకాశం బీఆర్ఎస్ పార్టీ కలిగించింది. ఆమె అత్యధిక మెజారిటీతో గెలవడం జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం లేకుండానే, ఆమెకు ఇంకా వివాహం కూడా కాకుండానే, అతి తక్కువ వయసులో ఈరోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా విచారకరం.

ఈ సందర్భంగా నేనొక అంశం మీ దృష్టికి తీసుకురాదలచుకుంటున్నాను. ఈ రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ మంది యువకులు, వారి విలువైన జీవితాలు కోల్పోవటం మనం చూస్తున్నాం. ముఖ్యంగా ఓ.ఆర్.ఆర్ రోడ్డుపై ఇటువంటి ప్రమాదాలు చాలా జరుగుతున్నాయి. పెద్దలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిగారి తనయుడు కూడా ఓ.ఆర్.ఆర్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇంకా చాలామంది మరణిస్తున్నారు. మన ప్రభుత్వం, అలాగే గౌరవ ముఖ్యమంత్రిగారు కొన్ని నియమ, నిబంధనలను రూపొందించి, ఓ.ఆర్.ఆర్.తోబాటు ఇతర రోడ్డు ప్రమాదాలను సాధ్యమైన మేరకు నివారించడానికి అవసరమైనటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఈ సందర్భంగా మీ దృష్టికి తీసుకొస్తున్నాను. లాస్య నందిత గారి కుటుంబానికి, అలాగే వారి బీఆర్ఎస్ పార్టీకి కూడా నేను సానుభూతిని తెలియజేస్తూ, నమస్కారాలతో సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:- అధ్యక్షా, మీకు ప్రత్యేకించి ధన్యవాదాలు. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, గౌరవ సోదరీమణి లాస్య నందితగారు మరణించడం చాలా బాధాకరమైన అంశం. వారి తండ్రిగారైనటువంటి సాయన్నగారు, నేను 1994లో ఇద్దరం ఒకేసారి శాసన సభకు రావడం, అప్పటి నుండి నిరంతరంగా శాసన సభలో మేమున్న సందర్భం ఉన్నది. వారు మృదు స్వభావి. సాయన్నగారి జీవితం ఎలా ఉండేదంటే, కంటోన్మెంట్ అంటే సాయన్న, సాయన్న అంటే

కంటోన్మెంట్ అనే విధంగా ఆ నియోజకవర్గానికి ఎనలేని సేవలు చేసి, వారి ఆరోగ్యం బాగలేకపోయినాగానీ, వారికి నడవటానికి రాకపోయినప్పటికీ, ఆ తపన, ఆ ఆవేదన, బాధ, ఎప్పుడూ ఆ ప్రజల మధ్యలో ఉండాలనే భావన వారికుండేది. అక్కడున్నటువంటి అనేక సమస్యల పరిష్కార విషయంలో కూడా నిరంతరంగా పాటుపడినటువంటి వ్యక్తి ఆయన. కానీ, విధి రాతను మనం ఏమీ చేయలేము కాబట్టి, వారు మరణించడం, తద్వారా, వాళ్ళ అమ్మాయికీ, రాజకీయంలో ఆసక్తి కలగడం జరిగింది. వారికి ముగ్గురు కూతుర్లు, సాయన్నగారి ఆరోగ్యం బాగలేనప్పుడు, వారెప్పుడూ కూడా నిరంతరంగా సాయన్నగారి వెంబడి ఉండేవారు. సచివాలయానికి వచ్చినా, అధికార్ల దగ్గరకు లేదా ప్రభుత్వం దగ్గరకు వచ్చినా అదే విధంగా ప్రజల దగ్గరకు పోయినా, సపోర్టుగా బిడ్డలుంటుండేవారు. ఆరోజుల్లో హైదరాబాద్ సిటీలో ముఠా గోపాల్‌గారు, సాయన్నగారు ఒకే స్కూటర్ మీద తిరిగేవారు. ఆరోజు జవహర్‌నగర్ కార్పొరేటర్‌గా గోపాల్‌గారు గెలిచారు, వీరేమో ఓడిపోయారు. దాని తరువాత 2016లో దోమల్‌గూడ డివిజన్ పేరు కవాడిగూడా అని పెడితే, నేను ఓడిపోయిన ప్రాంతంలో నా బిడ్డ గెలవాలని, సభ్యులు కేటీఆర్‌గారు చెప్పినట్లు, కేసీఆర్‌గారిని అడగడం, టికెట్ ఇవ్వడం, ఆ తరువాత వారు గెలవడం, ఇవన్నీ జరిగినాయి. కానీ, అనుకోకుండా సాయన్నగారు మరణించిన సందర్భంలో ఆరోజు ఆ కంటోన్మెంట్ ప్రజల ఆవేదన, బాధ చూశాం. ఎందుకంటే వారికి ఆ నియోజకవర్గ ప్రజలతో 30 ఏండ్ల అనుభవం ఉంది. ఆ తరువాత పార్టీ నిర్ణయం తీసుకొని, వారి అమ్మాయికి టికెట్ ఇచ్చారు. ఆ సమయంలో ఇన్‌ఛార్జ్‌గా నేనే ఉన్నాను అధ్యక్షా.

రెండవది, నేను ఆరుసార్లు ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఆ కంటోన్మెంట్ ఓటర్‌నే, కాబట్టి, అక్కడ నిరంతరంగా ఆ అమ్మాయి గెలుపుకోసం, పార్టీ ఇచ్చిన ఆదేశానుసారం, నిరంతరం ఒక వైపు నేను పోటీ చేస్తూ, మరోవైపు ఆ అమ్మాయి పోటీచేస్తున్నప్పటికీ, నేను ఆ రెండు నియోజకవర్గాలను చూసుకోవడం జరిగింది. కానీ, ఆ అమ్మాయి గెలిచి రెండు మాసాల ఇరవై రోజులయింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత, మొదటి శాసన సభలో ఆ అమ్మాయి ప్రమాణస్వీకారం చేయడం, మొదటి శాసన సభలో ఇక్కడుండడం, మనందరికీ తెలిసినదే. కానీ, అనుకోకుండా అర్లీ అవర్స్‌లో ఓ.ఆర్.ఆర్. మీద ప్రమాదం జరిగింది. ఆరోజు పొద్దున్నే ఫోన్ వచ్చింది ఇలా జరిగిందని, వెంటనే వారి సిస్టర్ నివేదితకు ఫోన్ చేస్తే, ఆ అమ్మాయి విషయాన్ని వివరించింది. వెంటనే హరీష్‌రావుగారు సంగారెడ్డి ఆసుపత్రికి వెళ్ళి, తదుపరి కార్యక్రమాలు దగ్గరుండి, ఆ తరువాత గాంధీకి తీసుకురావడం, తీసుకువచ్చిన మీదట మిగిలిన కార్యక్రమాలు జరిగాయి. కాబట్టి విధిని మనమేమి చేయలేము అధ్యక్షా.

11.30 ఉ. విధిని మనం తప్పించలేము. మనిషి జననం, మరణం అనేది సర్వసాధారణమైనప్పటికీ ఆ కుటుంబానికి మాత్రం తీరని అన్యాయమే జరిగింది అధ్యక్షా. తండ్రిని కోల్పోయి ఒక సంవత్సరం కాకముందే.. ఎంతో భవిష్యత్తు ఉన్నటువంటి అమ్మాయి లాస్య నందిత గారు కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోవడం చాలా విచారకరం. వారి కుటుంబమే ప్రజలకు అంకితమైనటువంటి కుటుంబం. కానీ అనుకోకుండా ఆ అమ్మాయి మరణించడంతో ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరికీ సాధ్యమవడం లేదు. పార్టీ పరంగా, ప్రజల పరంగా ఎవరికీ సాధ్యం కాని పరిస్థితి అది. చిన్న వయసు, 37 సంవత్సరాల వయస్సులో బిటెక్ చదువుకున్న ఆ అమ్మాయి చనిపోయిన విషయం బాధాకరమైనది. ఏది ఏమయినప్పటికీ భగవంతుడు ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని నేను ఈ సందర్భంగా తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీమతి వి. సునీతాలక్ష్మారెడ్డి:- అధ్యక్షా, లాస్య నందిత గారి మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఇది నిజంగా చాలా బాధాకరమైన విషయం. చిన్న వయస్సులో శాసన సభ సభ్యురాలిగా గెలిచి, తన తండ్రి ఆశలను నెరవేర్చాలనే ఆలోచనతో రాజకీయ రంగ ప్రవేశం చేసింది. ప్రజాసేవ చేయాలనే ఆత్రుతతో, ప్రజలకు దగ్గర కావాలనే ఒక ఆలోచనతో ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ మధ్యలోనే ఆ ఆశయాలను, ఆలోచనలను వదిలి మన నుండి దూరం కావడం జరిగింది. చిన్న వయసులో శాసన సభలోకి వచ్చినా

పెద్దలంటే ఒక భక్తి, గౌరవం ఉండేది. మేము నలుగురం మహిళా శాసన సభ్యులం ఇక్కడ ఉండేవాళ్లం అధ్యక్షా. ఎక్కడ కూర్చున్నా కూడా తను వచ్చి మాట్లాడిచ్చేది. మీరు సీనియర్లు మీరు కూర్చోండని తను లేచి మాకు స్థానాలు ఇచ్చేది. మేము నలుగురం ఎక్కడైనా మీటింగుకు వెళ్ళినపుడు మాతోపాటూ ఉండాలని మేము నలుగురం కలిసి కూర్చోనే విధంగా స్థానాలు ఉంచేది. నిజంగా చాలా హడావుడిగా ఉంటూ సందడి సందడి చేసే లాస్య నందిత ఈ విధంగా అర్థాంతరంగా మన నుండి దూరం కావడం చాలా బాధాకరం. వారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. థాంక్యూ.

శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్:- ధన్యవాదాలు అధ్యక్షా. లాస్య నందిత మృతి పట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమర్థిస్తున్నాను. నిజంగా చాలా బాధాకరం అధ్యక్షా. లాస్యనందిత నాకు చిన్నతనం నుంచి తెలుసు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో గృహలక్ష్మి హౌసింగ్ సొసైటీలో మా ఇంటి పక్కనే వాళ్ళ ఇల్లు ఉండేది. సాయన్న గారు శాసనసభ్యులుగా.. శ్రీనివాస్ యాదవ్ గారు చెప్పినట్లు ఆయన కంటోన్మెంట్ సాయన్నగా పేరుగాంచారు.

ఒక దళిత నాయకుడుగా తను ఉన్నన్ని రోజులు పేదప్రజలకు ఉన్న అనేక సమస్యలపై పోరాటం చేస్తూ సౌమ్యుడిగా మంచి పేరు తెచ్చుకున్న ఒక గొప్ప నాయకుడు. సాయన్న గారు షుగర్ వ్యాధితో బాధపడి చనిపోవడం, వారు చనిపోయిన కొద్దిరోజులకే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో చనిపోయిన సంఘటన మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. మా కుటుంబంలో అందరూ కూడా భరించలేని ఒక విషాదమైన రోజు అది.

వాళ్ళు ముగ్గురు అక్కాచెల్లెళ్ళు. వారు ఎప్పుడు కలిసినా కూడా నవ్వుతూ, నవ్విస్తూ చాలా పాజిటివ్ దృక్పథంతో ఉండే వ్యక్తులు వాళ్ళు. మాకు విద్యార్థి దశ నుంచి తెలిసిన ఆ కుటుంబం నుంచి ఒక యువ మహిళ శాసన సభ్యురాలిగా రావడానికి ముందు వారి సొంత ప్రాంతమైన ముషీరాబాద్, దోమల్‌గూడ ప్రాంతాలలో కార్పోరేటరుగా ఉన్నారు. పేక్‌పేట్‌లో వారి నాన్న గారు ప్రారంభించిన చిన్న పెట్రోల్ బంక్ ఉంది. వారు ముగ్గురు అక్కాచెల్లెళ్ళు కలిసి పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తుండేవారు. నేను 20 సంవత్సరాల క్రితం మణికొండలో నిర్మించుకున్న ఇంటికి మారినపుడు, పెట్రోల్ బంక్‌లో పని పూర్తవగానే వాళ్ళు మాఇంటికి వచ్చి మా కుటుంబంతో గడిపేవారు. ఆ సంఘటనలు గుర్తు చేసుకుంటే ఒక సొంత కుటుంబ సభ్యురాలు ఈరోజు మన మధ్యన లేరనే బాధ కలుగుతోంది.

వారి నాన్న మరణించిన పిమ్మట ఆమె శాసన సభ్యురాలుగా ఎన్నికై మా ఇంటికి వచ్చి చెప్పిన ఒక సంఘటన గుర్తుకు వస్తోంది. మా నాన్న ప్రజలకు చాలా చేశాడన్నా., ఇన్ని సంవత్సరాలు శాసన సభ్యుడిగా చేశారు కానీ ఇంకా మా కుటుంబంలో ఎవరూ ఆర్థికంగా సెటిల్ కాలేదు. మా భవిష్యత్తుకు ఇంకా పూర్తి స్థాయిలో ఏ ఆధారం లేకుండా పోయింది. నేను మా నాన్నని మించిన నాయకురాలిని కావాలి, మంచి పనులు చేయాలి, నాకు ఒక మంచి అవకాశం వచ్చింది నేను నిరూపించుకోవాలని అనేక సార్లు చెప్పినటువంటి సంఘటనలు ఉన్నాయి. ఈరోజు ఆమె ఇక్కడ లేకపోవడం చాలా బాధాకరం, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నాను. ఆ కుటుంబానికి ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వ పక్షాన అందించాలని ముఖ్యమంత్రిగారిని కోరుతూ, అదేవిధంగా ఆ పార్టీ (బీఆర్ఎస్) వారిని కూడా ఆ కుటుంబానికి అండగా ఉండాలని కోరుతున్నాను.

శ్రీ ముఠా గోపాల్:- నమస్కారాలు అధ్యక్షా. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడుతున్నాను. సాయన్న గారు, నేను ఎంతో కాలంగా మంచి మిత్రులం. ఆయన 1994 సంవత్సరంలో కంటోన్మెంట్ ప్రాంతం నుండి ఎంఎల్ఏగా ఎన్నికవడం జరిగింది. సాయన్న గారు సిండికేట్ బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తూ కూడా రాజకీయాల్లో శ్రద్ధ చూపించేవారు. ఆయన 1986వ సంవత్సరంలో దోమల్‌గూడ డివిజన్ నుంచి కార్పోరేటరుగా పోటీ చేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటి నుంచి కూడా ప్రజాజీవితంలో క్రియాశీలకంగా

పనిచేస్తూ పార్టీ పరంగానే కాకుండా ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నాకానీ సహాయం చేసేవారు సాయన్న గారు.

కంటోన్మెంట్ ఎంఎల్ఏగా ఉన్నాకానీ నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తూ, ప్రజల మధ్య తిరుగుతూ వారికి సేవ చేసిన వ్యక్తి సాయన్నగారని నేను తెలియజేస్తున్నాను. సాయన్నగారికి అనుకోకుండా డయాబెటిస్ వచ్చి ఒక కాలు పనిచేయకుండా పోయినప్పటికీ ఆయన ప్రజలలో తిరుగుతూ వారికి అందుబాటులో ఉండి పనిచేసేవాడు. సాయన్న గారి భార్య కూడా ఆప్కాబ్‌లో ఆఫీసరుగా పనిచేశారు. ఆయనకు ముగ్గురు కూతుర్లు.. నమ్రత, నివేదిత, లాస్యనందిత. వీరు ముగ్గురూ ఉన్నత విద్యావంతులు. సాయన్న ఎప్పుడు బయటకు వచ్చినా కానీ ఆయనతోపాటూ ఆ ముగ్గురూ కూడా వచ్చేవాళ్ళు. దగ్గరుండి ఆయనకు సేవలు చేసేవారు. లాస్యనందిత క్రీడల్లో, చదువుల్లో, రాజకీయాల్లో కూడా అవగాహన ఉన్న వ్యక్తి, కాబట్టి ఆమెని రాజకీయాల్లో పైకి తీసుకురావాలని సాయన్న గారు కోరుకునేవారు. ఆయన మరణించిన తరువాత లాస్యనందిత కంటోన్మెంట్ ప్రాంతం నుండి టిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలవడం జరిగింది. అందరితో కలుపుగోలుగా తిరిగే వ్యక్తి ఆమె. ఆమె క్రీడల్లో కూడా ఉత్సాహం చూపించేది. ఖోఖో, టెన్నిస్ ఆటలు చాలా బాగా ఆడేది. ఆమె మరణం చాలా శోచనీయం. ఎంఎల్ఏ అయిన తరువాత కూడా అందరితో కలిసి తిరుగుతూ, కార్పోరేటరుగా కవాడిగూడ డివిజన్‌లో అందరితో కలిసిమెలిసి తిరిగి మంచి పేరు తెచ్చుకున్న లాస్యనందిత ఇంత తొందరగా మరణించడం చాలా బాధాకరం. భగవంతుడు వారి ఆత్మలకు శాంతి చేకూర్చాలని, లాస్యనందిత చనిపోవడం తీరని లోటుగా భావిస్తూ ముగిస్తున్నాను.

11.40 ఉ. **శ్రీ శ్రీ గణేష్:-** లాస్య నందిత గారి మృతికి సంబంధించి గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను అధ్యక్షా. చిన్ననాటి నుండి వారి తండ్రితో కలిసి లాస్య నందిత గారు మా కంటోన్మెంట్ నియోజకవర్గంలో తిరిగేవారు. వారు 2015వ సంవత్సరంలోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి బోర్డు మెంబర్‌గా పోటీ చేయడం జరిగింది. ఆ తరువాత 2016వ సంవత్సరంలో కవాడిగూడ కార్పొరేటర్‌గా అక్కడి స్థానిక ప్రజలకు ఎన్నో సేవలు అందివ్వడం జరిగింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో గెలిచిన కొన్ని రోజుల్లోనే వారు రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమని, వారు లేని లోటు కంటోన్మెంట్ ప్రజలకు, వారి కుటుంబానికి మరియు సాయన్న అభిమానులకు తీరని లోటని ఈ సందర్భంగా తెలుపుతున్నాను. ఆ రోజు సాయన్న గారు ఎన్నికల్లో ఏ విధంగా పోటీ చేసి గెలవాలి, ప్రజలతో ఏ విధంగా మెలగాలి, ప్రజా జీవితంలో ఏ విధంగా ఉండాలనే విధంగా మాకు సలహాలు, సూచనలివ్వడంతో, ఈ రోజు నేను ఈ సభలో మాట్లాడగలుగుతున్నానని తమరి ద్వారా తెలుపుతున్నాను. అదేవిధంగా వారు గెలిచిన తరువాత అన్నా, గెలిచే వరకే మనకు పోటీ, నేను గెలిచాను. మీరు కూడా ప్రజలకు మంచి చేయాలని అనుకున్నారు. మనమందరం కలిసి కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచాలని లాస్య నందిత గారు చెప్పడం చాలా గొప్ప విషయమని తెలుపుతున్నాను. మేము వారికి పోటీ ఉన్నప్పటికీ, ఏనాడు పోటీగా భావించకుండా మాతో కలిసి ఉండి అన్ని విధాలుగా సహాయం, సహకారాలు అందించేవారు. ఈ రోజు వారు మరణించడం వారి కుటుంబానికే కాకుండా మాకు కూడా చాలా బాధాకరమని ఈ సందర్భంగా తెలుపుతున్నాను. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం కల్పించాలని కోరుకుంటూ, నా యొక్క ప్రగాఢ సానుభూతి వ్యక్తపరుస్తూ, మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

శ్రీ పాయల్ శంకర్:- అధ్యక్షా, నాకు ఈ సభలో మాట్లాడేందుకు అవకాశమిచ్చినందుకు తమరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. మేము శాసన సభలో అడుగుపెట్టిన కొత్తలో సహచర శాసన సభ్యురాలిగా మొదటి సమావేశంలోనే తను మాట్లాడిన మాటలు, ఆప్యాయంగా పలకరించిన పలుకులు ఇప్పటికీ మాకు గుర్తుకొస్తున్నాయి. వారు ఇంత చిన్న వయస్సులో స్వర్గస్తురాలవడం చాలా బాధాకరం. సాయన్న గారి జీవితం

తెలంగాణ రాజకీయాలకే ఆదర్శం. సహజంగా ఒక శాసన సభ్యుడి పేరును శాసన సభ్యుని పేరు కన్నా ముందే ఆ యొక్క నియోజకవర్గం పేరుతో పిలిచిన వ్యక్తి ఏవరైనా ఉన్నారంటే ఒక్క సాయన్న గారేనని ఈ సందర్భంగా తెలుపుతున్నాను. సాయన్న గారి పేరు కంటే ముందు కంటోన్మెంట్ సాయన్న అని పిలిచేవారు. చాలా తక్కువ మందికే ఇంటువంటి అవకాశాలు వస్తుంటాయి. ఏదేమైనా అంత చిన్న వయస్సులో ఆమె స్వర్గస్తురాలవడం, అదే విధంగా సంవత్సరం లోపే తండ్రి, కూతురు ఇద్దరూ కూడా స్వర్గస్తులవడం అనేది వారి కుటుంబానికి ఎంతో మనోవేదనను మిగిల్చింది. సాయన్న గారు గాని, లాస్య నందిత గారు గాని ఆ నియోజకవర్గంలో చేయాలనుకున్న పనులను, పెండింగ్‌లో ఉన్న సమస్యలను, రాజకీయ భేషజాలను కూడా ప్రక్కన పెట్టి పరిష్కరించే ప్రయత్నం చేస్తే, ఈ సభ ద్వారా వారిరువురికీ ఘనంగా నివాళులు అర్పించిన వారమవుతామని తెలుపుతూ, ఈ అవకాశం కల్పించిన తవరికి మరొక్కసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- జి.హెచ్.ఎమ్.సి.కి సంబంధించిన గౌరవ ఎమ్మెల్యేలెవరైనా కుమారి లాస్య నందిత గురించి మాట్లాడదలుచుకుంటే మాట్లాడండి.

శ్రీ కె.పి. వివేకానంద్:- కుమారి లాస్య నందిత గారు ఈరోజు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అధ్యక్షా. పెద్దలందరూ చెప్పినట్లుగా సాయన్న గారు తన నియోజకవర్గం పేరుతోనే పిలవబడేవారు. ఉమ్మడి రాష్ట్రంలోని 294 నియోజకవర్గాలలో ఉన్న అందరికీ కూడా కంటోన్మెంట్ సాయన్న గారు అంటేనే సుపరిచితుడని చెప్పవచ్చు. సౌమ్యుడు, అందరితో కలిసిపోయే తత్వం ఉన్న వారు సాయన్నగారు. వారి పిల్లలు కూడా చురుగ్గా వారి వెంటే ప్రజా క్షేత్రంలో పర్యటిస్తూ, ప్రజలందరి మన్ననలు పొందిన సంగతిని కూడా మనం చూడడం జరిగింది. లాస్య నందిత ఎమ్మెల్యేగా ఎన్నిక అయిన తరువాత మా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న శాసన సభ్యులను, పెద్దలందరిని ప్రత్యక్షంగా కలిసి మీ అందరి సహకారం, సలహాలు, సూచనలు అందించాలని కోరడం జరిగింది. నియోజకవర్గంలో మంచి పేరు తెచ్చుకోవాలనే తపన, తాపత్రయం తనలో కనపడింది అధ్యక్షా. వారు ఇంటికొచ్చి ఒక మాట అన్నప్పుడు నాకు ఒక విషయం గుర్తుకొచ్చింది. నేను కొత్తగా శాసనసభ్యుడిగా ఎన్నికైనప్పుడు మేమున్న 15 మంది ఎమ్మెల్యేలలో సాయన్నగారు సీనియర్ సభ్యులు, నాయకులు. ప్రభుత్వాన్ని ఏ విధంగా ప్రశ్నలడగాలని, ఏ విధంగా పనులను చేయించుకోవాలని, ఏ విధంగా ప్రజాసమస్యలను లేవనెత్తాలని వారు ఎప్పటికప్పుడు నా వద్దకు వచ్చి చెప్పి నన్ను ప్రోత్సహించేవారు. వారు చేసిన సలహాలు, సూచనలు, డైరెక్షన్స్‌ను గుర్తుంచుకొని లాస్య నందిత గారిని కూడా మంచిగా ప్రోత్సహించి ముందుకు నడిపించాలని అనుకున్నాం. కానీ, విధి మరో విధంగా ఆలోచించి వారిని మన మధ్యన లేకుండా చేయడం చాలా బాధాకరమైన విషయం. వారు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగానే కాకుండా, హైదరాబాద్ నగర జి.హెచ్.ఎంసి కార్పొరేటర్‌గా కూడా పనిచేసినప్పుడు అప్పుడున్న 150 మంది కార్పొరేటర్లందరితో మంచితనం కలిగి, మంచి స్థానం సంపాదించుకున్న నాయకురాలిగా పేరు తెచ్చుకున్నారు. మేము మొన్న జరిగిన జిహెచ్ఎంసి జనరల్ వార్డు మీటింగ్‌కి వెళ్లినప్పుడు తన గురించే అందరూ మాట్లాడుతుంటే, తను కార్పొరేటర్‌గా పని చేసిన ఐదు సంవత్సరాలే కాకుండా, తరువాత కూడా ప్రజా జీవితంలో అంకితభావంతో పని చేసిందని మనం అర్థం చేసుకోవచ్చు. వారు ఇప్పుడు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమైన విషయమని తెలియజేస్తూ, బీఆర్ఎస్ సభ్యులుగా మేమందరం వారి కుటుంబానికి అండగా ఉంటామని, సాయన్న గారి కుటుంబానికి ధైర్యాన్ని మరియు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ అవకాశం ఇచ్చిన తవరికి ధన్యవాదాలను తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి:- అధ్యక్షా, లాస్య నందిత గారు మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరం అధ్యక్షా. వారి కుటుంబంతో మా కుటుంబానికి అనేక సంవత్సరాలుగా అనుబంధం ఉంది. వారి తండ్రి సాయన్న

గారు ఎన్నికలలో ఐదు పర్యాయాలు గెలిచి కంటోన్మెంట్ ప్రాంతంలో ఎనలేని అభివృద్ధి చేసిన ఒక గొప్ప వ్యక్తి. వారు నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా ప్రజలకు సేవలందించిన గొప్ప మహోనీయుడు. ఆయన చనిపోయిన తరువాత వారి ఆశయాలకు అనుగుణంగా లాస్యనందిత గారు కూడా కంటోన్మెంట్‌కు ఎంతో సేవ చేయాలని అనుకున్నారు. అర్ధాంతరంగా ఆమె మన మధ్య నుంచి వెళ్ళిపోవడం చాలా బాధాకరం. ఆ కుటుంబం ఎంతో మందికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలిచిందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. కంటోన్మెంట్‌లో వాళ్ళు ఉండటానికి స్వంత ఇల్లు కూడా లేదు. నిజంగా ఎంతో అవినీతి రహితంగా వారు ప్రజలకు సేవలందించారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆ కుటుంబానికి ఒక ఇంటి స్థలాన్ని కేటాయించి ఘనంగా నివాళి అర్పించవలసిందిగా నేను ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. సభలో మాట్లాడటానికి ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

మిస్టర్ స్పీకర్:- సంతాప ప్రతిపాదన

సంతాప ప్రతిపాదన

హైదరాబాద్ జిల్లాలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎస్సీ శాసన సభ నియోజకవర్గ సభ్యురాలు కుమారి లాస్యనందిత సాయన్న గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

కుమారి లాస్యనందిత సాయన్న గారు 1987వ సంవత్సరంలో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లిలో శ్రీ జి.సాయన్న మరియు శ్రీమతి గీత దంపతులకు జన్మించారు. వీరు కంప్యూటర్ సైన్స్‌లో బి.టెక్. పూర్తి చేశారు.

కుమారి లాస్యనందిత గారు 2016లో జరిగిన జి.హెచ్.ఎమ్.సి ఎన్నికల్లో కవాడిగూడ డివిజన్ నుండి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 2023లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎస్సీ శాసనసభ నియోజకవర్గం నుంచి శాసన సభ్యురాలిగా గెలుపొందారు. వీరు 2024 ఫిబ్రవరి, 23వ తేదీన శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. వీరి వయస్సు 37 సంవత్సరాలు. కుమారి లాస్యనందిత సాయన్న గారి ఆత్మకు శాంతి చేకూరేందుకు గాను, రెండు నిమిషాలపాటు మౌనం పాటిద్దాం.

(రెండు నిమిషాల పాటు సభ మౌనం పాటించింది)

జూలై 24, 2024 ఉదయం 10.00 గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేస్తున్నాను.

(The House, then adjourned at 11.52 a.m. to meet again at 10.00 a.m. on Wednesday, the 24th July, 2024)

*****

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."